నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02

బంగారం ధర ₹62,950 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 77,500

సెన్సెక్స్ 70,730

నిఫ్టి 21,386

చికెన్ ధర 1KG ₹320

గుడ్ల ధరలు డజన్ ₹68

జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డులు విడుదల

జేఈఈ మెయిన్ సెషన్ -1 పరీక్షలు మొదలయ్యాయి. బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం బుధవారం పేపర్-2 పరీక్ష నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) అధికారులు పేపర్-1 పరీక్షకు సర్వం సిద్ధం చేశారు. 27న జరిగే పేపర్-1(బీఈ/ బీటెక్) పరీక్షకు అడ్మిట్ కార్డుల్ని (JEE Main Admit Cards) విడుదల చేశారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డుల్ని ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్ https://jeemain.nta.ac.in/నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, కోర్స్, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి సబ్‌మిట్ చేయడం ద్వారా Admit cards పొందొచ్చు. దేశవ్యాప్తంగా జనవరి 27, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జేఈఈ మెయిన్ (JEE Main) పేపర్ 1 పరీక్ష రెండు షిఫ్టుల్లో జరగనుంది. మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు.. రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుంది. గతేడాది కన్నా ఈసారి రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చాయి. దేశ వ్యాప్తంగా దాదాపు 12.30లక్షల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 2.5లక్షల మందికి పైగా ఉన్నారు. దేశంలోని ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జేఈఈ మెయిన్ ర్యాంకులే ప్రామాణికం.

నేడు భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్..

ప్రధాని మోదీతో కలిసి జైపూర్‌లో రోడ్‌షో

ఈఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ హాజరవుతున్నారు. ఇందులో భాగంగా నేడు భారత్ చేరుకోనున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్ విమానాశ్రయంలో ఫ్రెంచ్ అధినేత దిగనున్నారు. ఆయనకు ప్రధాని మోదీ ఘనంగా స్వాగతం పలుకనున్నారు. అనంతరం ఇద్దరు నేతలు కలిసి జైపూర్‌లో ర్యాలీ నిర్వహించనున్నారు. అదేవిధంగా పింక్ సిటీలో పలు పర్యాటక ప్రవేశాలను సందర్శిస్తారు. గురువారం రాత్రికి ఢిల్లీకి చేరుకోనున్నారు. గణతంత్ర వేడుకల తర్వాత రాజ్‌భవన్‌లో 'ఎట్ హోం' కార్యక్రమంలో పాల్గొంటారు.గణతంత్ర దినోత్సవ వేడుకలకు భారత్ వస్తున్న ఆరో అధ్యక్షుడిగా మాక్రాన్ నిలవనున్నారు. గతంలో ఫ్రెంచ్ అధ్యక్షులు ఫ్రాంకోయిస్ హోలాండ్ (2016), నికోలస్ సర్కోజీ (2008), జాక్వెస్ చిరాక్ (1998), వాలెరీ గిస్కార్డ్ డి ఎస్టేయింగ్ (1980)లు దేశానికి వచ్చారు. కాగా, మాక్రాన్ తన రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌తో పలు ఒప్పందాలు చేసుకోనున్నారు. ముఖ్యంగా రక్షణ, భద్రత, క్లీన్ ఎనర్జీ, వాణిజ్యం, పెట్టుబడులు, కొత్త సాంకేతికతోపాటు ఇతర రంగాల్లో ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరుగనున్నట్లు తెలుస్తున్నది.

త్వరలో కొత్త రేషన్ కార్డులు.. మీ సేవలో దరఖాస్తుకు చాన్స్



కొత్త రేషన్‌కార్డుల జారీపై రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి నెల చివరి వారంలో కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులను స్వీకరించాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించింది. ప్రజాపాలనలో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు స్వీకరించిన రాష్ట్ర ప్రభుత్వం... తాజాగా కొత్త రేషన్‌కార్డులకూ దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది. అర్హులందరూ కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుచేసుకోవాల్సిందేనని స్పష్టం చేస్తోంది. కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారి సంఖ్య అధికంగా ఉండడంతో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా పౌర సరఫరాల శాఖ కసరత్తులు చేస్తోంది. అభయహస్తంతో సంబంధం లేకుండానే.. రేషన్ కార్డుల అప్లికేషన్లను స్వీకరించాలని నిర్ణయించింది. అర్హులైన వారు తమ సమీప మీ సేవా కేంద్రాల్లోనే రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా 2.86 కోట్ల మందికి లబ్ధి పొందుతున్నారు. కాగా.. ఇటీ-వల స్వీకరించిన ప్రజా పాలనలో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు రాగా.. అందులో అయిదు గ్యారెంటీ-లకు సంబంధించి 1,05,91,636 దరఖాస్తులుండగా.. కొత్త రేషన్ కార్డులు, ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19,92,747 వచ్చాయి. ప్రజాపాలన కార్యక్రమంలోభాగంగా రేషన్ కార్డుల కోసం అప్లై చేసుకున్న వారి సంఖ్య అధికంగా ఉండటం విశేషం. గతంలో మాదిరిగానే మీ సేవ ద్వారా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు తెలిసింది. రాష్ట్రంలో చాలా మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రజాపాలనలో భాగంగా అయిదు గ్యారంటీల కోసం ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తులను రేషన్‌కార్డు లేనివారు సమర్పించలేకపోయారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో కొత్త రేషన్‌కార్డులు త్వరగా జారీ చేయాలని ప్రజల నుంచి ప్రభుత్వానికి పెద్ద సంఖ్యలో విజ్ఞప్తులు అందాయి. ఈ నేపథ్యంలో కొత్త రేషన్‌కార్డులను యుద్ధ ప్రాతిపదికన జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ-ల అమలుకు రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకోనుండడంతో కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు ప్రాధాన్యత ఏర్పడింది.

మాలిలో కూలిన బంగారు గని.. 70 మందికి పైగా మృతి



మాలిలో బంగారు గని కూలి 70 మందికి పైగా మరణించారు. మృతుల సంఖ్య పెరుగుతుందనే భయంతో అన్వేషణ కొనసాగుతోంది. ప్రభుత్వ జాతీయ జియాలజీ అండ్ మైనింగ్ డైరెక్టరేట్‌లోని సీనియర్ అధికారి కరీమ్ బార్తే బుధవారం ప్రమాదాన్ని ధృవీకరించారు. మీడియా కథనాల ప్రకారం.. గత శుక్రవారం సంభవించిన ప్రమాదానికి కారణమేమిటో స్పష్టంగా తెలియలేదు. గనుల మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో.. మరణించిన వారిలో చాలా మంది మైనర్లు ఉన్నట్లు అంచనా వేయబడింది. నైరుతి కొలికోరో ప్రాంతంలోని కంగబా జిల్లాలో ఈ ప్రమాదం జరిగింది. ఆఫ్రికాలోని మూడవ అతిపెద్ద బంగారు ఉత్పత్తి దేశమైన మాలిలో ఇటువంటి ప్రమాదాలు సర్వసాధారణం. కానీ భద్రతా చర్యలను విస్మరిస్తున్నారని వారు తరచుగా ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే రాష్ట్రం ఈ ఆర్టిసానల్ మైనింగ్ రంగంలో ఆర్డర్ తీసుకురావాలని బార్తే అన్నారు. గనుల మంత్రిత్వ శాఖ ప్రకటన ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మైనర్లు, మైనింగ్ సైట్ల సమీపంలో నివసిస్తున్న కమ్యూనిటీలు భద్రతా అవసరాలు పాటించాలని కోరారు.

డేటింగ్‌లో ఉన్నది నిజమే కానీ..

గత సంవత్సరం వరుస సినిమాలతో తెరపై సందడి చేసిన ప్పటికీ ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్. ఆ లోటును తీర్చేయడానికి త్వరలో 'ఎమర్జెన్సీ' సినిమాతో అభిమానుల ముందుకు వస్తోంది. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రమే 'ఎమర్జెన్సీ'. ఇందుకు సంబంధించిన ఓ కొత్త పోస్టర్‌ను సైతం ఆమె సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. 'భారతదేశంలో చీకటి క్షణాల వెనుక ఉన్న కథను తెలుసుకోండి. ఈ సినిమాలో దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పాత్రలో కనిపించనుంది కంగనా.ఇదిలా వుండగా ఆమె తాజాగా చేసిన మరో పోస్ట్ నెట్టింట ఆసక్తికర చర్చకు దారి తీసింది. ఈజ్ మై ట్రిప్ వ్యవస్థాపకుల్లో ఒకరైన నిషాంత్ పిట్టితో తాను రిలేషన్‌లో ఉన్నట్లు వస్తున్న వార్తలపై కంగనా రనౌత్ స్పందించారు. అవన్నీ వదంతులు మాత్రమేనని కొట్టిపారేశారు. 'దయచేసి అసత్య ప్రచారం చేయకండి. ఇదే నా విన్నపం. నిషాంత్‌కి పెళ్లయింది. ఆయన వైవాహిక జీవితం సంతోషంగా ఉంది. నేను వేరే వ్యక్తితో డేటింగ్‌లో ఉన్నా. సరైన సమయం కోసం ఎదురుచూడండి. దయచేసి మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి.

మూడో ప్రపంచ యుద్ధం రావొచ్చు..

ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్



ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో నెలకొన్న పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నదని ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ అన్నారు. ఇది మరింత విస్తృతమయ్యే అవకాశం ఉన్నదని, మూడో ప్రపంచ యుద్ధం కూడా రావొచ్చని అభిప్రాయపడ్డారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా భారత్ వచ్చిన ఫ్రాన్సిస్ బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎర్ర సముద్రంలో హౌతీల దాడులను మూడో పక్షం ప్రోత్సహిస్తున్నట్టుగా కనిపిస్తున్నదని, ఇది ప్రమాదకరని అన్నారు. పర్యటనలో భాగంగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు.నేటి భౌగోళిక రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా భద్రతా మండలి ప్రస్తుత కూర్పు లేదని, దాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

టీఎస్పీఎస్సీ కొత్త చైర్మన్‌గా మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి

గవర్నర్ ఆమోదం

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా ఎం. మహేందర్‌రెడ్డిని నియామకం ఖరారైంది. మాజీ డీజీపీ అయిన మహేందర్‌రెడ్డి నియామకాన్ని ఆమోదిస్తూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గురువారం నిర్ణయం తీసుకున్నారు. అలాగే టీఎస్‌పీఎస్‌సీ సభ్యులుగా రిటైరర్డ్ ఐఏఎస్ అనిత రాజేంద్ర, పాల్వాయి రజనీ కుమారి, అమీర్ ఉల్లా ఖాన్, యాదయ్య, వై రాంమోహన్‌రావు నియమితులయ్యారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పోస్టింగ్ కోసం మొత్తంగా 370 వరకు దరఖాస్తులు అందాయి. ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించి.. దరఖాస్తుల పరిశీలన, అర్హులను సూచించే బాధ్యతలను అప్పగించింది. కమిటీ వేగంగా దరఖాస్తుల పరిశీలన చేపట్టింది. చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసినవారిలోంచి మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి పేరును ప్రభుత్వానికి సూచించింది. ప్రభుత్వం ఆ పేరును గవర్నర్‌కు పరిశీలనకు పంపింది. చివరకు గవర్నర్ ఆయన నియామకానికి ఆమోదం తెలిపారు.

బీజేపీలోకి మాజీ సీఎం జగదీష్ శెట్టర్

కర్ణాటక కాంగ్రెస్‌కు భారీ షాక్ తగిలింది. కర్ణాటక మాజీ సీఎం జగదీష్ శెట్టర్ సొంత గూటికి చేరుకున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన శెట్టర్. తిరిగి కమలం గూటికే చేరారు. మాజీ సీఎం యడ్యూరప్ప, ఇతర సీనియర్ నేతల ఆధ్వర్యంలో గురువారం కాషాయ కండువా కప్పుకున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పాటు ఇతర నేతలతో భేటీ అయిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. కాగా మరో మూడు నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జగదీష్ శెట్టర్ బీజేపీలో చేరడం ఆసక్తిగా మారింది. బహుశా ఆయన కాషాయ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉంది. కాగా జగదీష్ శెట్టర్.. కర్ణాటకలో రాజకీయంగా ప్రభావవంతమైన లింగాయత్ వర్గానికి చెందిన నేత.. బీజేపి నుంచి తన సొంత నియోజకవర్గం హుబ్లీ ధార్వాడ్ సెంట్రల్ సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన శెట్టర్‌కు.. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ నిరాకరించింది.

హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అరెస్టు

రెరా కార్యదర్శి, గతంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన శివబాలకృష్ణను ఏసీబీ అరెస్టు చేసింది. బుధవారం ఉదయం నుంచి శివబాలకృష్ణ ఇల్లు, కార్యాలయం, ఆయన బంధువుల ఇండ్లలో సోదాలు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం తెల్లవారుజామున 3 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులను గుర్తించిన అధికారులు.. లాకర్లు తెలిస్తే మరిన్ని ఆస్తులు బయటపడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. బినామీల పేరుతో వందల కోట్ల ఆస్తులను కూడబెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటికే వారిని విచారించి కీలక వివరాలు సేకరించారు. ఆయనపై బినామీ చట్టం ప్రయోగించే యోచనలో ఉన్నారు. మణికొండలోని ఆదిత్యపోర్ట్ వ్యూలో విల్లా నంబర్ 25లో శివబాలకృష్ణ నివాసం ఉంటున్నారు. 2018 నుంచి 2023 వరకు హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన, ఆరు నెలల క్రితం రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) కార్యదర్శిగా బదిలీ అయ్యారు. మెట్రోరైల్ ప్లానింగ్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శివబాలకృష్ణపై అవినీతి ఆరోపణలు రావటంతో ఆయన ఆస్తుల చిట్టాపై ఇటీవల ఏసీబీ ఆరా తీసింది. ఆదాయానికి మించిన ఆస్తుల ఆధారాలు సేకరించి.. సోదాలు నిర్వహించింది. ఇందులో రూ.20 కోట్ల నగదు, ఖరీదైన సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, వాచ్‌లు, కిలోలకొద్దీ బంగారు, వెండి ఆభరణాలు, విలువైన బహుమతులు, వందల సంఖ్యలో డాక్యుమెంట్లను గుర్తించినట్టు తెలిసింది. నిందితుడిన నేడు కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉంది.

తడోబా అభయారణ్యంలో నల్ల చిరుత

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన తడోబా అభయారణ్యంలో పర్యాటకులకు నల్ల చిరుత కనిపించింది. ముంబై నుంచి వచ్చిన పర్యాటకులు అభయారణ్యంలోని కొలారా ద్వారం గుండా ప్రవేశిస్తున్నారు. ఈ క్రమంలో వారికి కొద్ది దూరంలో నల్ల చిరుత ఎదురైంది. ఎంతో అరుదుగా కనిపించే ఈ చిరుత.. రెండేళ్ల తర్వాత కనిపించిందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

సూర్య
www.suryaa.com

బోల్డ్ లుక్స్‌లో అనుపమ

ప్రేమమ్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కేరళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఆ తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో వచ్చిన అ ఆ సినిమాలో నాగవల్లి క్యారెక్టర్ లో కనిపించి అందరిని మెప్పించింది.అనుపమకి హీరోయిన్ గా తెలుగులో మొదటి సూపర్ హిట్ వచ్చింది మాత్రం శతమానం భవతి సినిమాతో. శర్వానంద్ హీరోగా చేసిన ఈ సినిమా.. సంక్రాంతి పండుగ కానుకగా వచ్చి ఫ్యామిలీ ప్రేక్షకులను మంచిగా ఆకట్టుకుంది.ఇక ఆ తరువాత నానితో.. కృష్ణార్జున యుద్ధం.. రామ్ తో ..ఉన్నది ఒకటే జిందగీ.. సాయి ధరమ్ తేజ్ తో.. తేజ్ ఐ లవ్ యు.. లాంటి సినిమాలలో నటించింది.కాగా నిఖిల్ తో చేసిన కార్తికేయ 2 చిత్రం మాత్రం పాన్ ఇండియా పరంగా ఈ హీరోయిన్ కి సూపర్ సక్సెస్ సాధించి పెట్టింది.తెలుగులోనే కాకుండా ఈ కార్తికేయ 2 సినిమా హిందీలో సైతం భారీ కలెక్షన్స్ సొంతం చేసుకుంది. ఆ తరువాత నిఖిల్ తో మరోసారి 18 పేజెస్ సినిమాలో కనిపించింది ఈ హీరోయిన్.ఇక ప్రస్తుతం అనుపమ ఇంస్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫోటోలు అందరినీ తెగ ఆకట్టుకుంటున్నాయి. పింక్ షైనింగ్ శారీలో.. మ్యాచింగ్ బ్లౌజ్ తో.. తన మేకప్ రూమ్ లో కూర్చొని ఫోజులు ఇచ్చింది అనుపమ.



మెహిదీపట్నం స్కైవాక్‌కు లైన్ క్లియర్

మెహిదీపట్నం చౌరస్తాలో ఏర్పాటు చేయనున్న స్కైవాక్ నిర్మాణానికి మార్గం సుగమమైంది. స్కైవాక్ కోసం అవసరమైన భూమిని అప్పగించేందుకు రక్షణ శాఖ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే స్కైవాక్ నిర్మాణ పనులను పునరుద్ధరించనున్నారు. వాహనాల రద్దీ, అత్యధిక జనసమ్మర్థం కలిగిన మెహిదీపట్నం కూడలిలో పాదచారులు నలువైపులా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా స్కైవాక్ నిర్మాణాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. కానీ స్కైవాక్ విస్తరణకు అవసరమైన స్థలం అందుబాటులో లేకపోవడంతో రక్షణ శాఖకు చెందిన స్థలాన్ని ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఈ మేరకు రక్షణ శాఖతో సంప్రదింపులు జరిపారు. కానీ అప్పట్లో భూమిని ఇచ్చేందుకు రక్షణ శాఖ అధికారులు ససేమిరా అనడంతో పనులు నిలిచిపోయాయి. ఉప్పల్ స్కైవాక్ పూర్తి చేయడంతో పాటు మెహిదీపట్నం స్కైవాక్ నిర్మాణాన్ని కూడా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు అప్పట్లో హెచ్ఎండీఏ ప్రణాళికలను సిద్ధం చేసింది. కానీ స్థలం లభ్యత సవాల్‌గా మారడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం స్కైవాక్‌కు అవసరమైన 3,380 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడంతో పనులు పరుగులు పెట్టనున్నాయని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు.

ఫలించిన సీఎం రేవంత్‌రెడ్డి చొరవ..

ట్రాఫిక్ రద్దీ కారణంగా రోడ్లపై నడిచి వెళ్లేవారి భద్రత దృష్ట్యా మెహిదీపట్నంలో స్కైవే నిర్మించాలనే ప్రతిపాదనలు ఎప్పటినుంచే ఉన్నాయి. కానీ.. రైతు బజార్ ప్రాంతంలో ఉన్న తమ భూములను ఇచ్చేందుకు రక్షణ శాఖ అంగీకరించకపోవటంతో పీటముడి పడింది. రక్షణ శాఖ పరిధిలోని 0.51 ఎకరాల స్థలం తమకు బదిలీ చేయాలని గత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అత్యంత రద్దీ ఉండే మెహిదీపట్నం రైతు బజార్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ పెరిగిపోయింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే సిటీలో ట్రాఫిక్ రద్దీని అధిగమించే చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ నెల 5వ తేదీన ఢిల్లీకి వెళ్లినప్పుడు ప్రత్యేకంగా రక్షణ శాఖ మంత్రిని కలిశారు. మెహిదీపట్నంలో ఉన్న రక్షణ శాఖ భూములను తమకు బదిలీ చేయాలని కోరారు. ఈ మేరకు అక్కడ ఉన్న డిఫెన్స్ జోన్‌కు ఇబ్బంది లేకుండా కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్పులకు అనుగుణంగా స్కైవే డిజైన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అధికారులు మార్పులు చేశారు. సవరించిన కొత్త ప్రతిపాదనలను ఇటీవలే కేంద్రానికి పంపించారు. దీంతో స్కైవే నిర్మాణానికి అవసరమైన మేరకు భూముల కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలిపింది. మొత్తం 3,380 చదరపు గజాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించనుంది. బదిలీ చేసిన భూములకు బదులుగా కేంద్రం డిఫెన్స్ విభాగానికి రూ.15.15 కోట్ల విలువైన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించాల్సి ఉంటుంది. మరికొంత స్థలానికి పదేళ్ల పాటు లైసెన్స్ రుసుం చెల్లించాలనే నిబంధన విధించింది. నాలుగు వారాల్లోనే ఈ భూములను అప్పగించేందుకు కేంద్ర రక్షణ శాఖ అంగీకరించింది. దీంతో మెహిదీపట్నం స్కై వాక్ పనులకున్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. ముంబై హైవేలో అత్యంత కీలకమైన రైతు బజార్ జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించనుంది. వీలైనంత త్వరగా స్కైవే నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ABVP నాయకురాలిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లిన పోలీసులు

జీవో నెం.55కి వ్యతిరేకంగా హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత కొన్ని రోజులుగా విద్యార్థులు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నాయి. విద్యార్థులకు మద్దతుగా.. నిన్న ఏబీవీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో.. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ అక్కడి నుంచి పరుగు తీశారు. అయితే ఝాన్సీని పట్టుకునేందుకు ఇద్దరు మహిళా పోలీసులు స్కూటీపై వెంబడించారు. తన దగ్గరకు రాగానే.. వెనుక ఉన్న పోలీసు తనను అడ్డుకునే ప్రయత్నంలో ఝాన్సీ జుట్టును పట్టుకున్నారు. అయితే.. స్కూటీ నడుస్తుండగా ఝాన్సీ కిందపడిపోయింది. అయినా కూడా ఝాన్సీని వదలకుండా అలాగే జుట్టును గట్టిగా పట్టుకునే వున్నారు. అయితే వెంటనే బండిని ఆపడంతో

పెను ప్రమాదం తప్పింది. స్కూటీని ఆపి ఆమెను అలాగే పట్టుకుని ఉన్నారు. ఝాన్సీ లేచి పోలీసులపై సీరియస్ అయ్యారు. ఇలాగేనా మహిళల పట్ల పోలీసులు వ్యవహరించడం అంటూ ఫైర్ అయ్యారు. అవును ఇలాగే ఉంటుంది మరి అంటూ పోలీసులు సమాధానం ఇచ్చారు. అయితే ఈ ఘటనలో విద్యార్థి నాయకుడికి స్వల్ప గాయాలయ్యాయి. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో... ఈ ఘటన ఇప్పుడు వివాదాస్పదమైంది. ఓ విద్యార్థి నాయకురాలిపై ఇంత దారుణంగా ప్రవర్తించడంపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాస్త కూడా కనికరం లేకుండా జుట్టు పీక్కుని ఈడ్చుకుని వెళ్లడం ఏంటని మండిపడుతున్నారు. ఫ్రెండ్లీ పోలీస్ అంటూనే ప్రజలపట్ల కటువుగా వ్యవహరిస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఫైర్ అవుతున్నారు. ఈ భూములను హైకోర్టుకు తీసుకురావద్దని డిమాండ్ చేస్తున్నారు. జీవో నెం.55 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేటీఆర్ మైండ్ పని చేయడం లేదు.. సీతక్క ఫైర్

ఎమ్మెల్యే కేటీఆర్ పై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. కేటీఆర్ మైండ్ పని చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. విధ్వంసం రాజకీయాలకు కేటీఆర్ పాల్పడుతున్నాడని అన్నారు. అధికారం లేకుండా కేటీఆర్ ఉండలేకపోతున్నారని తెలిపారు. మీ అహంకారమే మీ ఓటమికి కారణమని అన్నారు. తొమ్మిదేళ్లు గడిలలో ఉండి పరిపాలన కొనసాగుతుందని అన్నారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఎమ్మెల్యే గెలిచిన ప్రమాణ స్వీకరం చేయడం లేదన్నారు. మాపై మాట్లాడే ముందు కేటీఆర్ కు బుద్ధి మైండ్ ఉండాలా? అని ప్రశ్నించారు. కేటీఆర్ కు నీచపు కుళ్ళు రాజకీయాలు ఎందుకు? అని మండిపడ్డారు. ప్రజలు మావైపే ఉన్నారు, మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేస్తే జీర్ణించు కోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆస్ట్రేలియాలో నీటమునిగి నలుగురు భారతీయులు మృతి

ఆస్ట్రేలియాలో నలుగురు భారతీయులు దుర్మరణం చెందారు. విక్టోరియా రాష్ట్రంలోని ఫిలిప్ ఐలాండ్‌కు చెందిన బీచ్ వద్ద వారంతా నీట మునిగి మరణించారు. 20 ఏళ్లలో ఆ ప్రాంతంలో ఈ తరహా విషాదం చోటు చేసుకోవడం ఇదే తొలి సారని అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఫిలిప్ ఐలాండ్ బీచ్ సమీపంలో వారిని గుర్తించిన సిబ్బంది కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అక్కడే ముగ్గురు మరణించగా, మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలున్నారు. దీనిపై కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ స్పందించింది. 'ఆస్ట్రేలియాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. నీటమునిగి నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలియజేస్తున్నాం. ఇతర సహాయచర్యల నిమిత్తం మెల్‌బోర్న్ అధికారులు మృతుల సన్నిహితులతో టచ్‌లో ఉన్నారు' అని వెల్లడించింది.

పాత బకాయిలు చెల్లిస్తేనే.. టీ యాప్ ఫోలియోలో కొత్త సేవలు!

ఆన్‌లైన్‌లో సేవలు అందించడంలో కీలకమైన టీ యాప్ ఫోలియోకు అదనంగా ఫీచర్లు చేర్చాలని నిర్ణయించినప్పటికీ.. ముందుకు సాగడం లేదు. దీని ద్వారా 32 శాఖలకు సంబంధించి 225 పైగా ఆన్‌లైన్‌లో సేవలు పొందే అవకాశముంది. ఎక్కువ శాతం రవాణా సేవలు వినియోగించుకుంటున్నారు. దాదాపు 17 రకాల సేవలను ఇంటి నుంచే వాడుకుంటున్నారు. ఆర్టీఏ కార్యాలయాల వద్ద ఏజెంట్ల దందా నడుస్తున్న తరుణంలో టీ యాప్ ఫోలియోతో వాహనదారులకు వెసులుబాటు ఏర్పడింది. ముఖ్యంగా నకిలీ లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్సుల రెన్యువల్, చిరునామా మార్పు, లెర్నర్ లైసెన్సు పునరుద్ధరణ లాంటి పనులకు కార్యాలయాలకు రాకపోవడంతో ఆర్టీఏ సిబ్బందిపైనా ఒత్తిడి తగ్గింది. ప్రస్తుతం అందిస్తున్న 17 సేవలకు మరో 12 వరకు కొత్తగా చేర్చాలన్నది ఆర్టీఏ అధికారుల భావన. లెర్నర్ డ్రైవింగ్ లైసెన్సు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు, వాహన యాజమాన్య హక్కుల మార్పిడి లాంటి మరిన్ని సేవలను తేవాలనేది ఉద్దేశం. పాత బకాయిల వల్ల కొత్త సేవలు చేర్చడానికి నిర్వాహకులు నిరాకరించినట్లు తెలుస్తోంది.

నేనింకా రిటైర్ కాలేదు..

భారత బాక్సింగ్ దిగ్గజం మేరీ కోమ్ రిటైర్మెంట్ ప్రకటించినట్లు ఇవాళ్టి ఉదయం నుంచి మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. తాజాగా కోమ్ ఈ ప్రచారంపై స్పందిస్తూ.. తన రిటైర్మెంట్‌పై వచ్చిన వార్తాల్లో ఎంత మాత్రం నిజం లేదని కొట్టిపారేసింది. తాను ఇంకా రిటైర్మెంట్ ప్రకటించలేదని.. ఒకవేళ ఆ నిర్ణయం తీసుకుంటే వ్యక్తిగతంగా మీడియా ముందుకు వస్తానని ఆమె తెలిపింది. ఈ మేరకు కోమ్ ప్రముఖ మీడియా సంస్థకు వివరణ ఇచ్చింది. ఇదిలా ఉంటే, 41 ఏళ్ల మేరీ కోమ్ మహిళల బాక్సింగ్‌లో ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా, ఒలింపిక్ విన్నర్‌గా (2012 ఒలింపిక్స్‌లో 51 కేజీల విభాగంలో కాంస్య పతకం) నిలిచిన కోమ్.. పురుష బాక్సర్లు కూడా సాధించలేని ఎన్నో ఘనతలు సాధించి చాలా సందర్భాల్లో విశ్వవేదికపై భారత కీర్తిపతాకను రెపరెపలాడించింది. ఓవరాల్‌గా మేరీ కోమ్ తన కెరీర్‌లో 13 స్వర్ణాలు సహా మొత్తం 19 పతకాలను సాధించి బాక్సింగ్ లెజెండ్‌గా గుర్తింపు తెచ్చుకుంది. మేరీ కోమ్ ప్రతిభకు గుర్తుగా భారత ప్రభుత్వం ఆమెకు 2002లో అర్జున అవార్డు, 2009లో ఖేల్ రత్న అవార్డు, 2006లో పద్మశ్రీ, 2013లో పద్మభూషణ్, 2020లో పద్మవిభూషణ్ పురస్కారాలను అందజేసింది. మేరీకోమ్ 2016లో రాజ్యసభ సభ్యురాలిగా నియమితురాలైంది. ఇద్దరు పిల్లలకు తల్లి అయినప్పటికీ కోమ్ రింగ్‌లో ఎన్నో అపురూప విజయాలు సాధించి ఔరా అనిపించింది.

ఢిల్లీలో రేపు మెట్రోలో వారికి ఉచిత ప్రయాణం!

దేశంలోని వివిధ ప్రాంతాల్లో జనవరి 26, గణతంత్ర దినోత్సవానికి సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్ కోసం రిహార్సల్స్ కొనసాగుతున్నాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నిఘా మరింతగా పెంచారు. ఢిల్లీలోని అన్ని కూడళ్లలో పోలీసులను మోహరించారు. వారు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా రిపబ్లిక్ డే పరేడ్ దృష్ట్యా, జనవరి 26న ఢిల్లీ మెట్రో రాకపోకల సమయాలను మార్చారు. ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) తెలిపిన వివరాల ప్రకారం గణతంత్ర దినోత్సవం నాడు ఉదయం నాలుగు గంటల నుండి మెట్రో రైళ్లు నడవనున్నాయి. ప్రజలకు పరేడ్‌ను చూసే అవకాశం కల్పించేందుకు డీఎంఆర్‌సీ మెట్రో రాకపోకల్లో మార్పులు చేసింది. 26న ఉదయం 4 గంటల నుంచి అన్ని రూట్లలో మెట్రో అందుబాటులో ఉండనుంది. రిపబ్లిక్ డే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఈ-టికెట్లు లేదా ఈ-ఇన్విటేషన్లు కలిగిన వారికి ప్రత్యేక కూపన్లు జారీ చేయనున్నట్లు డీఎంఆర్‌సి ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూజ్ దయాల్ సమాచారం తెలిపారు. ఈ కూపన్లు కలిగిన ప్రయాణికులు 'కర్తవ్య పథ్' వరకూ మెట్రోలో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఉచిత ప్రయాణం కోసం ప్రయాణీకులు తమ ఈ-టికెట్, ఈ-ఇన్విటేషన్ లేదా ఫోటో గుర్తింపు కార్డును మెట్రో స్టేషన్‌లోని సంబంధిత కౌంటర్లలో చూపించవలసి ఉంటుంది. ఇదిలావుండగా రిపబ్లిక్ డే సందర్భంగా రాజధానిలోని పలు బస్సుల రూట్లను కూడా మార్చారు. జనవరి 26న విజయ్ చౌక్, రాజ్‌పథ్, ఇండియా గేట్, తిలక్ మార్గ్-బహదూర్ షా జఫర్ మార్గ్-ఢిల్లీ గేట్-నేతాజీ సుభాష్ మార్గ్‌లలోకి ఎలాంటి వాహనాన్ని అనుమతించరు.



ప్రపంచ ఉత్తమ నగరాల్లో ఒకటిగా ముంబై

ప్రపంచంలోని టాప్-50 నగరాల జాబితాను 'టైమ్ ఔట్' తాజాగా విడుదల చేసింది. ఈ జాబితాలో ముంబై నగరం పన్నెండో స్థానంలో ఉంది. భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక నగరంగా ముంబై నిలిచింది. న్యూయార్క్, కేప్ టౌన్, లండన్, బెర్లిన్, మ్యాడ్రిడ్ మొదటి ఐదు స్థానాలను దక్కించుకున్నాయి. నగరాల్లో లభించే ఆహారం, సాంస్కృతిక సంపద, భవన నిర్మాణ రీతులు వంటి వాటిపై ప్రజాభిప్రాయం ఆధారంగా ఈ జాబితాను రూపొందించినట్లు టైమ్ ఔట్ తెలిపింది.